"మీరా... పదండి. యిప్పుడే వచ్చేస్తాను" అంటూ ఎవరో ఆవిడ వెనక వెళ్ళిపోయాడు.

నేను రైలు ఎక్కాను.

అతను రాలేదు.

ఇంకో నిమిషంలో రైలు బయల్దేరుతుందనగా హడావిడిగా పరుగెత్తుకొచ్చాడు.

"ఆవిడ..." అడగబోయేను.

"అబ్బే, మా బాస్ వైప్, మా ఉద్యోగంలో మాకు బాస్ భార్య, ఖూనీకోరు వీళ్ళే ముఖ్యం. అన్నట్టు చిన్ని ఎలా వున్నాడు? ఏం చదువుతున్నాడు? మీ ఆయన ఎలా వున్నారు? "ఏవంటు న్నారు? బుజ్జి కాలేజీలో చేరిందా?" అంటూ హడావిడిగా అడిగేస్తున్నాడు.

రైలు బైల్దేరుతోంది.

చటుక్కున మా పందెం గుర్తొచ్చింది నాకు. అతని తలవేపు చూసేను. టోపీ కప్పని జుత్తు చాలా నల్లగా వుంది. రంగు వేస్తున్నాడా?

"పందెం నువ్వు గెలిచేవే? ఎంత?" అడిగేను.

అతనికి మా పందెం హఠాత్తుగా గుర్తొచ్చింది.

చిన్నప్పటి ఆట గుర్తొచ్చినట్టు నవ్వేడు, రైలు కదిలింది.

"పందెం ఎంత? పెళ్ళికి వస్తే చాలా?" అన్నాను.

"థాంక్యూ!" అంటూ తమాషాగా బౌ చేస్తూ టోపీ తీసేడు.

ఉన్న నాలుగు వెంట్రుకలూ నల్లగానే ఉన్నాయి.

**(యువ, దీపావళి 10.11.1969)**

# వాహన యోగం

**"మా** నాన్నకి జాతకాలు. జోతిష్కులు వుంటే తిండి ఉద్యోగం, పెళ్ళాం, పిల్లలు యివేవీఁ అక్కర్లేదు... ఆయన నాడీ గ్రంథం మొదలు పేవ్‌మెంట్ మీద చిలక వరకు అన్నీ నమ్ముతాడు.... జాతకాన్ని, జీవితాన్ని వెరిఫై చేస్తూ జీవిస్తారు".

"ఈ మధ్య మీరు రావడం మానేసినట్టున్నారే?" ఓ ఫ్రెండు పరామర్శ.

"ఈ మధ్యే అన్నమాటేఁవిటి. పెర్మనెంటుగా మానేస్తాను. నా ఇష్టం!" అందామనుకున్నాను.

ఔను. రాయడం లేదు. ఎందుచేత?

తీరికలేక్కాదు. రాయాలన్న కోరికలేకపోవడం అబద్ధం. మరి?

కథలకి సరైన ప్లాటు కుదరక, కుదిరినవి నాకు నచ్చక. నాకు నచ్చినవి ఇతరులకి నచ్చక.

అస్త్ర సన్యాసవఁన్నా చేస్తాను కాని దేశం సుభిక్షం అనీ, ఆకలి చావులు లేవనీ, మనుషులంతా మంచి వాళ్ళని వగైరా విషయాలు ఎంచేతో రాయలేకపోతున్నాను. అంచేత కొన్నాళ్ళు రాయడం మానేద్దామనుకున్న మాట నిజం. (నేను రాయడం మానినంత మాత్రాన భూమ్యా కాశాలు ఏకం కాలేదు. కావు) కాని తిరిగే కాలూ, రాసే చెయ్యీ వూరుకోవు.

ఈసారి కథలోకి దరిద్రం పొలిమేరలక్కూడా రాకూడదు. గొప్పవాళ్ళు నా కథల్లోకి రారు. ప్రేమ కథలు రాయడం రాదు. మరింక ఏఁవిఁటి రాసేది. నా పిండాకూడు! అంచేత ఏదైనా ప్లాటు చెప్పండీ అంటూ మావార్ని గడ్డం, కడుపు పట్టుకొని బతి మాలేను. (కాళ్లు పట్టుకోవడం నా కిష్టం వుండదు) క్వార్టరెండ్ పనితోనూ, వార్నింగైనా లేకుండా జరుగుతున్న ఆఫీసు ఇన్‌స్పెక్షనుతోనూ అసలే ఉక్కిరి బిక్కిరి అయిపోతు న్నారేమో, ఏవఁనుకున్నారో ఏమో, ఒక్కసారి నన్ను ఎగాదిగా చూసి, "కథాలేదు, కాకరకాయా లేదు... నీ బోడి కథల కోసం ఎవడూ కాసుక్కూర్చో లేదు. నోరుమూసుకో" మన్నారు.

నోరైతే మూసుకోగలిగేను, కాని చెయ్యి మూతపడలేదు. ఏం చెయ్యడానికీ తోచలేదు. అంచేత యింకెవ్వరూ దొరక్క, ఏదైనా చిన్న ప్లాటు చెప్పండర్రా అని మా పిల్లల్ని పేరు పేరునాగా బలిమాలేను. వెధవలు నవ్వి వూరుకున్నారు. కాని చెప్పలేదు. మాచిన్ని మాత్రం, "మనింట్లో అందరిమీదా, తాత గారింట్లో అంద రిమీ రాయమ్మా, బోల్డు కథలవుతాయి" అని ఓ చిన్న సలహా యిచ్చేడు.

నిజమే, పరాయివాళ్ల గురించి రాస్తే పళ్ళు రాలగొడ తారు, కాని మా వాళ్ళ గురించి రాసుకుంటే ఏం? మాటవరసకి మా వారి గురించి రాస్తే...? నయం యింకా నాలుగు కాలాల పాటు నాకు బతకాలని వుంది. మా అమ్మ ? ఆవిడ జస్ట్ ఏన్ ఆర్డినరీ వుమన్. మా పిల్లలు? ఛ.ఛ. గుంట వెధవల్ని పత్రికల కెక్కిం

చనా? రేపు వాళ్ళకి పెళ్ళి,పెటాకులూ అవద్దూ? మా నాన్న .... ఆయన నన్ను క్షమిస్తారు.

మాకు కొత్త ఊరు ట్రాన్స్‌ఫరైతే, నాకైతే "ఆ వూళ్ళో మంచి ఇల్లు దొరుకుతాయా? యిళ్ళలో నూతులుంటాయా? నూతుల్లో నీళ్ళుంటాయా? వీధిలో కుళాయిలుంటాయా? ఉప్పు నీళ్ళా? మంచి నీళ్ళా? కూరా నారా చవగ్గా దొరుకుతాయా. పని మనుషులు అణిగి మణిగి పనిచేస్తారా? పొగరుబోతు వెధవలా?" వగైరా సందేహాలొస్తాయి.

మా పిల్లలూ, తమ్ముళ్ళూ అయితే, "అక్కడ సినిమాహాల్సు ఎన్ని ఉన్నాయి? బాల్కనీ వుంటుందా? ఫస్టు రిలీజు సెంటరా? ఇక్ష్వాకుల కాలం నాటివి వస్తాయా? ఇంగ్లీషు సినిమాలెప్పుడైనా వస్తాయా? హిందీ మేట్నీలైనా వేస్తారా? అన్నట్టు, 'విజయచిత్ర' 'ఫిల్మ్‌ఫేర్' టైముకి వస్తాయా? గర్ల్స్ హైస్కూలూ, వుమన్స్ కాలేజీ వున్నాయా?" (ఆఖరి ప్రశ్న మా తమ్ముళ్ళ ప్రత్యేకం) అని అడుగుతారు.

ఇంకా మా అమ్మ : "కంచి పట్టు చీరలు కన్సెషన్ రేట్లకి దొరుకుతాయా? స్టీలు సామాను యిన్‌స్టాల్‌మెంట్సు మీద యిస్తారా? వెంకటగిరి చీరలు పూతరేకుల్లా ఉతికే చాకలాళ్ళున్నారా?" అని అడుగుతుంది.

కాని మా నాన్నకి పైవి ఏవీ సందేహాల కింద అనిపించవు ఆయన ప్రకారం, "ఇల్లూ, బట్టలూ, సినిమాలూ, చాకళ్ళూ లేని వూరు లేదు. మరలాంటప్పుడు వీటి కోసం పెద్ద బెంగెందుకు? ఆ వూళ్ళో వాళ్ళు చెట్టుకింద వుండడం లేదు కదా! అందరూ ఎక్కడుంటే మనమూ అక్కడే వుందాం. అంతా ఏం తింటే మనం అదే తింటాం?" అని చాలా ఈజీగా తీసుకుంటారు. కాని ఆయన కొక్కటే బెంగ– మనో వ్యాధి వెళ్ళబోయే ఉళ్ళో పసందైన జ్యోతిష్కుడు ఉంటాడో? ఉండడో?

నిజమే. అన్నిఊళ్ళోలోనూ జ్యోతిష్కులు ఉంటారన్న నమ్మకం లేదు.

మా నాన్నకి జాతకాలూ, జ్యోతిష్కులూ వుంటే తిండీ, ఉద్యోగం, పెళ్ళాం, పిల్లలు యివేవీ అక్కర్లేదు. ఆయన తన జీవితంలో గ్రహాల్ని నమ్మిన దాంట్లో వెయ్యోవంతు మనుషుల్ని నమ్మి వుంటే ఎంతో బాగుపడి వుంటే వారు. ఆయన నాడీ గ్రంథం మొదలు పేవ్‌మెంట్‌మీద చిలక వరకు అన్నీ నమ్ముతారు. సంప్రదిస్తారు. జాతకాన్ని , జీవితాన్ని వెరిపై చేస్తూ జీవిస్తారు.

"ఇదిగో! చూడు బహుశా మనకీ నెలలో ట్రాన్స్‌ఫరు రావాలి. కొంచెం సరుకులు చూసుకొని తెప్పించు ఉన్నట్టుండి" అంటారు మా అమ్మతో.

"సంవత్సరం మధ్యలో కదుపుతార్టండీ? ఖర్చులు దండుగ అమ్మ అమాయకత్వం.

సంవత్సరం మధ్యలో కదపరని నాకూ తెలుసు. కాని ఆ కుజుడున్నాడే వాడు ఈ నెలలో చరస్థానంలోకి మారతాడు. అంచేత నాకుస్థాన చలనం తప్పదు. వాడుస్థాన చలనంకలిగించి కాని కదలడు"

జాతకుడుకీ, పై అధికార్లకీ యిష్టలేకపోయినా సరే కుజుడు పిలకపట్టుకొని లాక్కుపోతాట్ట మరోఊరు.

ఈ గ్రహాలకొక జబ్బుంది. అవి స్థిరంగా ఒకచోట ఉండవు. ప్రతివాడకీ స్వంత ఇల్లున్నాసరే ఎవడింట్లో వాడుండడు. అదేం ఖర్మో కాని, వాడింట్లో వీడు, వీడింట్లో వాడూ అలా ఎరకల వాళ్ళలా తిరుగుతూనే వుంటారు. పైగా ఒకడివే పొకరు ప్రేమగానూ, కోపంగానూ అలా రకరకాలుగా చూసుకుంటారు. పోనీ ఎవరిష్టం వాళ్ళది. ఆకాశంలో పక్షులూ, వీథుల్లో కుక్కలూ, అడవిలో జంతువులూ తిరగడం లేదా? అలాగే యివీ తిరుగుతే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని వాటితో పాటు యావత్ప్రపంచాన్నీ తిప్పిస్తాయట!

"ఒరే, ఈసారి నువ్వు పరీక్షకి కూర్చోకు. డబ్బుపోతే పోయింది. అన్నారు మా నాన్న. ఓ శుభముహూర్తాన మా తమ్ముడితో.

డబ్బు మాటెలా వున్నా వాడికి మతిపోయింది. "అదేవిటి నాన్నా? ఇవిపైన లియరుకూడాను. రెండునెల్ల నుండి ప్రిపేరవుతున్నాను. మా ప్రొఫెసరుకి నేనంటే మంచి యింప్రెషన్ ఉంది. ఇప్పుడు మానేస్తే ఎలా?" ఏడుపు గొంతుకతో అన్నాడు. కన్నీళ్ళదే ఆలస్యం.

పెద్దవాళ్ళు చెప్పడం, పిల్లలు వినడం రోజులు ఎప్పుడో పోయేయి. నాకు తోచింది చెప్పేను. ఇప్పుడు నీ అంతర్దశ ఏం బాగులేదు. ఈసారి నువ్వు పాసవ్వు. నీ ఇష్టం" అని విసుక్కున్నారు.

వీడు కష్టపడి రాసినా, ప్రొఫెసరు పాస్ చేద్దామనుకున్నా ఆ రాహువో ఎవరో గాని, వీడి పేపర్లు పట్టుకొని పారిపోతాట్ట.

ఇంతకీ ఏం జరిగిందంటే...

సెలవుల్లో నేను సకుటుంబంగా మా నాన్న గారింటి

కెళ్ళాను. ఓనాడు మా నాన్న అలవాటు ప్రకారం ఓ జ్యోతిష్కుణ్ణి వేటాడి పట్టుకొచ్చేరు. ఆయన భాషలో చెప్పాలంటే, బ్రహ్మాండ నాయకుడుట. జాతకంతో నిమిత్తం లేకుండా అతను అవుతుందీ అంటే అవుతుంది, కాదంటే కాదుట. అంత వాక్శుద్ధి కలవాడుట.

ఆ జ్యోతిష్కుడు ఉండవలసినట్టేఉన్నాడు. దబ్బపండులా పచ్చగా ఉన్నాడు. నుదుట మూడు గజాల విబూది రేఖలు, వెనుక మూరెడు పిలక ఉన్నాయి. అతని ఖద్దురు పంచ, ఖద్దరు లాల్చీ కొంచెం మాసి ఉన్నాయి. (సూటు వేసుకున్న జ్యోతిష్కుణ్ణి ఎంచేతో నమ్మాలనిపించదు). అతని చేతిలో పొడుం డబ్బా. జేబులో కళ్ళజోడూ ఉన్నాయి. వయస్సు అరవై దగ్గరుటుంది.

మా నాన్నలో వున్న విశేషం ఏవిఁటంటే, ఎదుట వాళ్ళ యిష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా, ఇంట్లో వున్న అందరి జాతకాలూ చూపించేస్తారు. ఒద్దు అనే అవకాశం కాని, అది కారం కాని మా ఇంట్లో ఎవరికీ యివ్వరు. పోనీ ఏ జ్యోతిష్కుడైనా బద్ధకించో, ఇష్టంలేకో ఏ విషయాన్నైనా దాటేద్దామనుకుంటే, వాడి ఖర్మ కొద్దీ మా నాన్నకి జ్యోతిష్యం బాగా తెలుసు. అంచేత వాళ్ళతో వాదన పెట్టు క్కూర్చుంటారు.

చూసేది మన జాతకం కాకపోతే, వినడానికి మహ సొంపుగా ఉంటుంది వాళ్ళ సంభాషణ. ఆ వేళ కూడా అలవాటు చొప్పున అందరి జాతక చక్రాలు తెచ్చి జ్యోతిష్కుని ఒళ్లో పడేసేరు మా నాన్న. పడేసి చూడండి. మావాడు (అంటే మా ఆయన) కారు కొనాలని మహా సరదాపడుతున్నాడు. ఎప్పట్లో కొంటాడో చూడండి. అని ఇంటి అల్లుడికి మొదటి ప్రిఫరెన్సు యిచ్చేసేరు.

అంతవరకు కుర్చీలో కాళ్ళు పెట్టుకొని ఈజీగా కూర్చున్న జ్యోతిష్కుడు ఒక్కసారి కళ్ళు ఝుళిపించి కుర్చీలో నిటారుగా కూర్చున్నాడు. కూర్చుని జాతక చక్రాన్ని తీక్షణంగా చూడ్డం ప్రారంభించేడు,

కారుకొనడం మాటెలా ఉన్నా, కారు ఏక్సిడెంటు ఏదైనా వుందేమో అన్పించింది నాకు. అతని వాలకం చూస్తే.

మా ఆయన మొహంలో రంగులు మారుతున్నాయి. నేనూ, మా అమ్మా శ్రోతలం. పెద్ద తుఫాను రాబోయే ముందున్న నిశ్శబ్దంలాంటిది ఆవరించింది మా చుట్టూ.

అతను, "కారు కదూ... వూఁ... వుహూఁ.... చతుర్థంలో నీచుడు ... కోణాధిపతి నీచుడితో కలిసేడు... వాహనయోగం" అంటూ గొణుక్కొని, "లేదు లాభం లేదు. ఈ జాతకునికి వాహన యోగం లేదు" అన్నాడు పిడుగుపడ్డట్టు.

మా వారు తుళ్ళిపడ్డారు. ఎక్కడ కొత్తకారు చూసినా మా వారికి అరిచేతులు దురదవేస్తాయి; డ్రైవ్ చెయ్యమని. మా వీధిలో ఎవరికి కారు లేకపోయినా మా వారికి డ్రైవింగ్ లైసెన్సుంది!

అదేవిఁటండీ? మేము కార్లని ట్రయల్స్ కూడా చూస్తు న్నాం. ఇవాళో రేపో ఒకటి సెలక్టు చేద్దామనుకుంటున్నాం. అన్నాన్నేను పెంకెతనానికి.

మీకు ఎంతొస్తుంది సుమారు? నా మాట లెక్కచెయ్యకుండా అతను మావార్ని అడిగేడు.

"దగ్గర దగ్గర వెయ్యి" డబుల్ టైఫాయిడ్ పడినంత నీర సంగా ఉంది మా వారి జవాబు.

"అసలీ జాతకుడికి నిన్నటి రూపాయి ఈవేళ ఉండకూడదు. అంత జీతంఉండడానికి వీల్లేదే. పన్నెండోయింట శని వ్యయంలో ఉన్నాడు, ఫ్చ్"

నయం. మా వారిది గవర్నమెంటు ఉద్యోగం కాబట్టి ఉద్యో గాన్ని బట్టి జీతం యిస్తున్నారు కాని, జాతకాన్ని బట్టి యిస్తే మేం మసి అయిపోయే వాళ్ళం.

"మీరేం బెంగపెట్టుకోకండి. వారానికొక నవల చొప్పున ఓ డజను నవలలు రాసిపారేసి మీకో కారుకొంటారు" మా వార్ని ఊరడించబోయేను.

"ఛీ, నోర్ముయ్!" గట్టిగానే కసిరేరు.

జ్యోతిష్యుడు తెల్లబోయేడు. మా వారు ఎవర్నినోరు ముయ్య మన్నారో అర్థం కాక.

మా అమ్మ నా వేపు చంపేస్తానన్నట్టు చూసింది.

జ్యోతిష్కుడ్ని చూస్తే "మా కారు యోగం మాటెలా వున్నా ఈ వేళ నీయోగం మూడింది మా వారి చేతిలో!" అనిపిం చింది నాకు.

"అప్పుచేసైనా కొన్లేనంటారా?" తను పెట్టిన బాంకిలోను జ్ఞాపకం వచ్చింది మా వారికి.

అతను మళ్ళీ లెక్కలు కట్టేడు.... "వూఁ వూఁ హుఁ శనిలో బుధుడు కొనిపించినా, రాహువున్నాడే నడవనివ్వడు. కారు షెడ్డులోనే వుంటుంది.

బావుంది. మా కారుకి అడ్డుగా రాహువు రోడ్డుమీద బోర్లా పడక్కుంటాడు కాబోలు.

ఒంట్లో వున్న రక్తం అంతా పంపుకొడితే మొహంలోకి వచ్చినట్టు, మావారిమొహం అంతా మగ్గిన టొమేటోలా ఎర్రగా అయిపోయింది. పాపం నాకు చాలా జాలేసింది. పైకి అలా ఏనుగంత కనిపిస్తారు, కాని, ఒట్టి చెవల పిల్లి. ఏంతైనా ఆయన కారు కొంటే నన్ను మాత్రం ఎక్కనివ్వ రేవిటి? ఈ టాపిక్ మార్చి కొంచెం హుషారివ్వాలి.

"మా వారు గొప్ప చిత్ర విచిత్రమైన యిల్లు కడతారని నాడీలో చెప్పేరు. కళాఖండం కడతార్ట. ఎప్పుడుకడతారు. ఈ అద్దె యిళ్ళల్లో వుండలేక ఛస్తున్నాం" అన్నాను.

అతను టిటనస్ వచ్చినవాళ్ళా యింకా బిగుసుకు పోయేడు. కొంతసేపు ఎక్కాలు వల్లించేడు. భాగించేడు. కూడేడు. అతని తీరు చూస్తే చిన్నప్పుడు అతను లెక్కల్లో పూర్ అనిపించింది నాకు. లెక్కలు కట్టడం అయ్యేక, "అసలీ జాతకానికి ఆస్తి ఉండడానికే వీల్లేదు. ఇల్లు స్థిరాస్తే కదా. అబ్బే!" అంటూ పనెదవి విరిచి, ఇల్లు కట్టరు, ఒకవేళ కట్టినా అది ఖండఖండాలుగానే ఉంటుంది. అంటే ఈ జన్మకి పూర్తవదు. మహా అయితే ఓ గజం ఎత్తున గోడలు లేవచ్చు", అని దూరంగా చూసేడు. మేము కట్టబోయే అసంపూర్తి యిల్లు అతనికి స్పష్టంగా కనిపిస్తున్నట్టు, కాస్సేపాగి అసలు ఈ పాటికి పిత్రార్జితం ఏమైనా ఉంటే అమ్మేసి ఉండాలే! అని కలిపేడు.

"ఇంకా అమ్మలేదు. ఇప్పుడు నువ్వు చెప్పేవు కాబట్టి అమ్మేస్తాం యింక" అనుకున్నాను.

ఆ సమయంలో మా వారి మొహం చూసే వరకు. అసలు మా వారి అన్ని భావాలు ఒక్కసారి చూపించగలరని నాకు తెలీలేదు. చికాకు, జాలి, ఇంకా ఎన్నో భావాలు కనిపించాయి. లాభం లేదు. ఈయన్ని కొంచెం చల్లార్చ కపోతే యిక్కడో హత్య జరగుతుంది. అనుకున్న నేను పోన్లెద్దురూ, ఓ గజం ఎత్తువరకైన ఆగోడలు లేస్తాయి కదా. అంతేచాలు వాటిమీదే రిటైరయ్యేక ఏ తడకో, రేకో వేసుకొని ఎస్కిమేలు, యిగ్లూల్లో దూరినట్టు మనం కూడా దూరేద్దాం" అంటూ మావార్ని మోచేత్తో చిన్నగా పొడిచేను.

"ఛీ, ఛీ నోర్మూయ్!" రెండోసారి గట్టిగానే విసుక్కున్నారు.

ముస్లిముల్లో మొగుడు పెళ్ళాంతో మూడుసార్లు 'తలాక్' అంటే వాళ్ళు విడిపోవచ్చునట. మన హిందువుల్లో మొగుడు పెళ్ళాన్ని "మూడుసార్లు ఛీ, చీ, నోర్మూయ్" అంటే ఏవిఁటో!

"మళ్ళీ నోరెత్తేవంటే నేను నిజంగానే తంతాను" అన్న చూపొకటి విసిరింది మా అమ్మ నా వేపు.

ఇహ నవ్వు మింగడం నా చేత కాలేదు. సినిమాల్లోనూ, నవలల్లోనూ, హీరోయిన్లు ఏడుపుని మింగడమో, వెనక్కి పీల్చుకోవడమో చేస్తారుట. నవ్వుని మింగమనండి చూద్దాం. మింగిన కొద్దీ పైకి తన్నేస్తోంది. నవ్వేనో నాకు తన్నులు తప్పవు. అంచేత యిప్పుడే వస్తానని చెప్పి పెరట్లోకి పారి పోయేను. పారిపోయి తనివి తీరా పగలబడి నవ్వేను. తల్చుకుని తల్చుకుని నవ్వేను. పెరట్లో వున్న జవాన్లు, పని మనిషి నా వైపు వింతగా చూడ్డం చూసి వాళ్ళు నన్ను చూసి "పెద్దమ్మాయి గార్కి మనస్సు సరిగ్గా లేదేవిఁటి పాపం. అని అనుకుంటారని యింకొంచెం గట్టిగా నవ్వాను.

అలా నవ్వి, నవ్వి అలసిపోయి, తిరిగి నేను వచ్చేసరికి ఆ జ్యోతిష్కుడు మావార్ని "యింకేమైనా అడగండి చెప్తాను" అని బతిమాల్తున్నాడు పాపం అతనూ (జ్యోతిష్యుడూ) ఫీలైనట్టున్నాడు. యితగాడికి "ఒక్క మంచి విషయం చెప్పలేదే" అని.

మా వారు మాత్రం "యింకేం వద్దండి. మిగిలిన వాళ్ళని కానీయండి. అన్నారు. ఇంకేవఁడిగినా ఈసారి నీకు ఉద్యోగం పోతుంది. నీ పెళ్ళాం చచ్చిపోతుంది. నీ పిల్లలు ఫకీరులై పోతారు" వగైరా అంటాడేమోనన్న భయంతో.

ఆఖరికి అతను వెళ్ళిపోయేటప్పుడు అసలు విషయం బైట పెట్టేడు. నాక కథ రాయాలంటే చెడు తప్ప మంచి కనిపించనట్టు. అతనికి జాతకం చూడగానే వాళ్ళ కష్టాలూ, జబ్బులూ, చావులూ, గండాలు తప్ప యింకేం కనిపించ వుట. ఏం చేస్తాం. అతని జాతకమే అంత!"

ఇది జరిగి దగ్గర దగ్గర రెండేళ్ళయింది. ఈ మధ్య ఎందుకో పని వుండి నేను ఒక్కర్తైనూ వెళ్ళేను మా నాన్నగారింటికి, మా కార్లోనే. గమ్మత్తేఁవిఁటంటే, నేను వెళ్ళే సరికి ఆ జ్యోతిష్కుడు మా ఇంటి దగ్గర వున్నాడు. మా నాన్నకి ఆస్థాన జ్యోతిష్కుడాయె.

అతన్ని చూసి నాకు కొంచెం ఏడిపిద్దామనిపించింది.

"ఏవండోయ్, బావున్నారా? ఏప్పుడొచ్చేరు? ఆ… అన్నట్టు మేము కారు కొన్నాం, చూసేరా?" అన్నాను.

అతను కారు చూడ్డం వాయిదా వేసి, "ముందు మీ అమ్మాయి జాతకం ఇవ్వండి. మీ అల్లుడుగారిది కూడా" అని మా నాన్న

దగ్గర రెండూ పుచ్చుకొని, రెంటిని విడి విడిగానూ, జమిలిగానూ చూడ్డం ప్రారంభించేడు.

"తప్పు సుమా,పెద్దతరం, చిన్నతరం లేకుండా ఏమిటా వాగుడు?" అన్న మా అమ్మ చూపుని తప్పించుకోలేక పోయాను.

జాతకాలు చూస్తున్న అతని మొహంలో క్రమేపి సంతృప్తి కనిపించింది.

"అద్గదీ సంగతి. ఇదివరకు అతని జాతకం చూసినప్పుడే అనుకున్నాను. ఇతనికి యింత యోగానికి కిటేకేమిటా అని ఇంకేం? మరి యోగం పట్టకేం చేస్తుంది. అమ్మాయి లగ్నంలో గురుదున్నాడు. పైగా బుధుడుతో కలిసేడు. నాలుగో యింట్లో నాలుగు శుభగ్రహాలు కలుసుకున్నాయి. నువ్వు కొనకపోతేఎవరు కొంటారమ్మా కారు? ఇహ చూడక్కర్లేదు. అసలు ఈ అమ్మాయిని కాని అతను చేసుకోకుండా యింకెవర్ని చేసుకున్నా సీసా చేత్తో పట్టుకొని, వీధికుక్కని పట్టుకొని ఏ హైదరాబాదలోనో, బొంబా యిలోనో బార్లలో పడి వుండును" గుక్క కోసం ఆగేడు.

మావారికి సెలవు లేక రాకపోవడం వల్ల ఆవేళ అతని మారకం తప్పింది.

"నీ జాతకంలో అసలు స్వార్జితం వుండాలే. బుధుడు మహా ఫవర్‌ఫుల్‌గా వున్నాడు" అని కలిపేడు.

"అంఎప్పుడైనా పాతికా పరకాయిస్తార్లెండి పత్రికల వారు" అన్నాను.

"ఇంకేం కొద్ది రోజుల్లో యిల్లు కూడా కట్తావు. ఫర్వాలేదు. నీ పేర ఆస్థికూడా వుండొచ్చు"

ఏదీ ఆ పాతికతోనా! యిల్లు కట్టవలెనన్న ఎన్ని పాతికలు కావలెను? (యిటుకలూ, పెంకులూ కావు. రూపాయలు).

"మీరు చెప్పిందికాకపోదు, శాస్త్రిగారూ! అన్నట్టు చూడండీ, మా వారికి ఎనభై నాలుగో యేట మారకం ఉందట. నా మాంగల్య బలంతో ఆయన్ని బతికించుకో గలనేమో చూడండి" అన్నాను.

ఆయన జవాబు చెప్పేలోగా మా అమ్మ నన్ను డైనింగ్ హాల్లోకి ఈడ్చుకుపోయింది.

**(యువ, దీపావళి 10.11.1970)**

# పిట్ట - పురుగు

**న**డిచి, నడిచి అలిసిపోయిన కదలని కాళ్ళ దేహంతోనే ముం దుకు తోసుకుంటూ "యింక నావాళ్లు కనిపించరు" అన్న నల్లని నిరాశ వీడిపోయి, తను కాపురం ఉంటున్న చెట్టు. తన వాళ్లు కనిపించగానే, కొండంత సంతోషంతో ముందు కాళ్ళతో మొహం తుడుచుకొని సర్వేశ్వరుడ్ని స్మరిస్తూ ఆకాశంలోకి చూసింది చీమ, ఆమె రెండు సున్నితమైన స్టీలు బంతులు అతి సున్నితమైన తీగతో కలిపి అతికినట్టుంది.

ఆ ఉదయం.

బాలభానుడు తన బంగారు చేతుల్తో ప్రపంచాన్ని కౌగలించు కున్న వేళ, తన పిల్లల్ని ఇల్లు వదలవద్దని బతిమాలి తిండి వేటకి బైల్దేర్దింది ఆ చీమ. బయలుదేరి అడవి అంతా నడిచింది. అడవిలో పంచదార డబ్బాలు, బెల్లం దిమ్మలూ ఉండవు. ఆఖరికి బియ్యం బస్తాలు కూడా ఉండవు. ఆఖరికి బియ్యం బస్తాలు కూడా ఉంవు. అంచేత దొరకని తిండి కోసం వెతుకుతూ లేని దార్లలో నడుస్తూ నేలకి బొట్టు బొట్టు కారుతున్న తేనె పట్టును ఆలశ్యంగా అయినాచూడగానే ఎంతో సంతోషించింది ఆమె. "ఇంక నా వాళ్లందర్నీ పిలుచుకొని రావడమే ఆలశ్యం అనుకున్న ఆమె పిల్చుకొని రావడానికి అంత ఆలశ్యం ఔతుందనుకోలేదు. కొంత సేపయ్యేక "పిల్చుకు రాగలనా అనంత రక్షకా" అన్న నిరాశ కూడా పట్టుకుంది ఆమెను. ఎంచేతంటే ఆమె దారి తప్పిపోయింది, తనకున్న 'పసి' తను తిరిగిన జాడల్లోనే సుళ్లు తిప్పుతోంది ఆమెను. ఆలశ్యం ఔతున్న కొద్దీ లేని సత్తువ తెచ్చు కొని, ఉన్న దాహం మరిచిపోయి పరిగెత్త నారంభించిన ఆమెకు, ఎన్నో గంటలు నడిచేక మళ్లీ తేనె తుట్టనే చేరుకునే సరికి ఆకలి, దప్పి, బలం, ధైర్యం అన్నీ పోయి, ఎటు చూసినా ఆకలికి పొర్లే తన పిల్లలే కనిపించేయి.

కనిపించని పిల్లల బాధ ఊహించుకుంటూ ఆమె కోరలు బిగబట్టి నడుస్తూ సర్వ రక్షకుడ్ని ఎముకల్లోంచి ప్రార్థిస్తూ చేసిన ప్రయత్నం ఫలించిన తన పుట్ట, చెట్టు కనిపించి తన తల్లంతా ఆకలిగానే వున్నా క్షేమంగానే వుండి తన కోసం ఎదురు చూస్తూం డటం చూపి – మొహం ముందు కాళ్ళతో తుడుచుకొని ఆకాశం లోకి అనంత రక్షకుడి కోసం చూడగానే కనిపించేయి – మధ్యా హ్నం లేత ఆకాశంలో గాజు ఆకుల్లా మెరుస్తున్న చెట్టు ఆకులు